క్లుప్తంగా

కౌలు కార్డులు తీసుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ సుధాకర్ రెడ్డి

సంజామల: కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు గుర్తింపు కార్డులు తీసుకోవాలని మండల అగ్రికల్చర్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి అన్నారు. సంజామల రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులతో సమావేశం నిర్వహించారు. పొలాలు కౌలుకు తీసుకుని సాగుచేసుకుంటున్న రైతులు గుర్తింపు కార్డులు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందాలంటే ఈ కార్డులు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. కౌలు కార్డుల కోసం భూ యజమాని ఆధార్ కార్డు, పొలం పాసుపుస్తకం, కౌలు రైతు ఆధార్ కార్డు, అగ్రిమెంట్, పాస్‌పోర్ట్ ఫొటోతో రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పారిశుద్ధ్య కార్మికులు

కోవెలకుంట్ల: మండలంలోని సౌదరదిన్నె గ్రామంలో సోమవారం ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేశారు. గ్రామానికి చెందిన ఒకటో తరగతి విద్యార్థి మహమ్మద్ రియాజ్ ఇటీవల డెంగీతో మృతి చెందిన విషయం తెలిసిందే. వర్షాల కారణంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ చేరి పారిశుద్ధ్యం లోపించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అన్వర్ ఆధ్వర్యంలో గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంకు, ఎస్సీ, బీసీ కాలనీ, మినరల్ వాటర్‌ప్లాంట్ తదితర ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. మురుగు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా కిరోసిన్, వేస్ట్ ఆయిల్, తదితర ద్రావణాన్ని పిచికారీ చేయించారు.

బ్రిడ్జిపై మొక్కల తొలగింపు



డోన్: పట్టణ నడిబొడ్డున ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి అడుగు భాగంలో మొక్కలు ఏపుగా పెరిగి బ్రిడ్జికి ప్రమాదకరంగా పరిణమించడంతో మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. 1.25 కిలోమీటర్ల పొడవున్న ఉన్న ఈ బ్రిడ్జికి ఇరువైపులా పిచ్చిమొక్కలతో పాటు వేప, రావి చెట్లు మొలవడంతో వాటిని తొలగించాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సిబ్బందిని ఆదేశించారు. దీంతో సిబ్బంది సోమవారం మొక్కలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు.


నాటుసారా స్వాధీనం



పట్టుబడిన సారా విక్రేతతో సెబ్ అధికారులు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తిమ్మనాయినపేటలో నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు బనగానపల్లె సెబ్ సీఐ జోగేంద్ర తెలిపారు. గ్రామానికి చెందిన దూదేకుల బాలహుసేని ఇంటి వద్ద నాటుసారా విక్రయిస్తుండడంతో సిబ్బందితో కలిసి తనిఖీలు చేసి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుమని చెప్పారు. సారాను సీజ్ చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపామని పేర్కొన్నారు. తనిఖీల్లో ఎస్ఐ పోతులయ్య, సిబ్బంది వెంకటరమణ, పాములేటి, శివన్న, వెంకటనాయుడు పాల్గొన్నారు.

మెప్మా ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ఆర్పీలతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

డోన్ టౌన్: మెప్మా ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివరామ్, మండల అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం డోన్ నెహ్రూనగర్‌లో మెప్మా ఆర్పీల యూనియన్ అధ్యక్షురాలు సుజాత అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పనితో ముడిపెట్టకుండా రూ.10 వేలు వేతనం చెల్లించాలని కోరారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సునీత, రమాదేవి, శశికల, మంగమ్మ, మణి, నూర్జాహాన్, చాంద్‌బీ, జరీనా పాల్గొన్నారు.

సూపర్ సిక్స్.. కాలయాపన ఫిక్స్..!

- ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు
- పూర్ టూ రిచ్ అంటూ గొప్పలు
- కూటమి మాటలు నమ్మి అధికారం ఇచ్చిన జనం
- అధికారంలోకి వచ్చాక అమల్లో తాత్సారం
- తల్లికి వందనం, పెట్టుబడి సాయం కోసం రైతుల ఎదురుచూపులు



బనగానపల్లె/డోన్: తాము అధికారంలోకి వస్తే పేదలను లక్షాధికారులను చేస్తామన్నారు. ఇంటికో ఉద్యోగం లేదా ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి అన్నారు. అమ్మకు వందనం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేలు ఇస్తామని గొప్పలు చెప్పారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని ఊదరగొట్టారు. వారి మాటలు నమ్మి జనం అధికారం కట్టబెట్టారు. తీరా అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటిన ఆ ఊసే ఎత్తడం లేదు. ఇది సూపర్‌సిక్స్ పేరుతో టీడీపీ అధినేత చంద్రబాబు మార్క్‌రాజకీయం. అసెంబ్లీ సమావేశాల్లో సంక్షేమ పథకాలకు నిధుల కేటాయింపు ఉంటుందని ఎదురుచూస్తున్న ప్రజల ఆశలపై నీళ్లు చల్లుతూ పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టకుండా ఓటాన్ బడ్జెట్‌తో ప్రజలను మోసం చేస్తున్నారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పేరుతో సంక్షేమాన్ని పక్కన పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. నిధులు లేవంటూ మరో ఏడాది సంక్షేమ పథకాలను వాయిదా వేసే కుట్రకు తెరలేపారు.

టీడీపీ ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు

- యువతకు 20 లక్షల ఉద్యోగాలు, ఉద్యోగం వచ్చే వరకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి
- అమ్మకు వందనం పేరుతో బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.20 వేలు
- ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు పెట్టుబడి సాయం
- ప్రతి మహిళకు(19–59 ఏళ్లు) నెలకు రూ.1500
- ప్రతి ఇంటికీ ఏడాదికి 3 ఉచిత సిలిండర్లు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

హామీల అమలు విధానం ఇదేనా?

- పాఠశాలలు ప్రారంభమై నెల దాటినా ఇంత వరకు తల్లికి వందనం సాయం అందలేదు. దీంతో ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపే తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు.
- అధికారంలోకి వస్తే రూ.10 వేలు వేతనం ఇస్తామని వలంటీర్లకు హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు వారికి వేతనాలు అందలేదు. నిధులు కేటాయించలేదు.
- ఖరీఫ్‌లో రైతులకు పెట్టుబడి సాయం అందకపోవడంతో అప్పులు చేసి సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

రైతు భరోసా లబ్ధిదారులు	
బనగానపల్లె	42,005
డోన్	29,990
అమ్మకు వందనం లబ్ధిదారులు	
బనగానపల్లె	27,128
డోన్	44,840

- మెగా డీఎస్సీ అంటూ నిరుద్యోగులకు ఆశలు కల్పించినా తీరా వాయిదాలతో కాలక్షేపం చేస్తున్నారు.
- ఉచిత ఇసుక అంటూ రవాణా చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బడులు తెరిచిన వెంటనే విద్యార్థుల కోసం అమ్మఒడి, ఖరీఫ్ సీజన్ ప్రారంభమై తొలకరి జల్లులు పడిన వెంటనే రైతు భరోసా ఇచ్చి ఆదుకునేది. అయితే కొత్తగా అధికారంలోకి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని.. తల్లికి వందనం, రైతు భరోసాను.. అన్నదాత సుఖీభవగా పేరు మార్చింది. ఇవే కాకుండా సూపర్ సిక్స్‌లో మిగిలిన హామీలు కూడా అమలు చేయాల్సి వుంది. ప్రభుత్వం ఏర్పాటై 40రోజులకు పైగా అయినప్పటికీ పథకాల అమలు ఊసేలేదు.

బనగానపల్లెలో ప్రధాన సమస్యలు

నియోజకవర్గ ఎమ్మెల్యేగా రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఉన్నారు. బనగానపల్లెలో ప్రధానంగా రింగ్‌రోడ్డు నిర్మాణం. ఎస్ఆర్‌బీసీ పంట కాల్వల అభివృద్ధి. యాగంటి క్షేత్రం, రవ్వలకొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం, కుందూ నదికి అనుసంధానంగా జోలదరాసి రిజర్వాయర్‌ను నిర్మిస్తే కుందూనది పరివాహక గ్రామాల్లో సాగుతాగునీటి సమస్య తీరుతుంది. పూర్తిస్థాయిలో దద్దణాల ప్రాజెక్టును అభివృద్ధి చేయాలి. బనగానపల్లె పట్టణంలో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ కోసం నియోజకవర్గ ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఆశలు.. అడియాశలయ్యేనా



నా పేరు పావని. ఇద్దరు పిల్లలు ఉన్నారు. అవుకు గ్రామంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్‌లో భాగంగా తల్లికి వందనం పథకం ద్వారా ఇద్దరు పిల్లలకు నగదు వస్తుందని ఆశించాను. విద్యాసంవత్సరం ప్రారంభమైనా ఇప్పటికీ ఇంకా పథకం ఊసే లేదు. ఫీజులు ఎక్కువైనా తల్లికి వందనం పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని ఇద్దరినీ ప్రైవేటు పాఠశాలలోనే చేర్పించాను. కానీ నా ఆశలు అడియాశలు అయ్యేలా ఉన్నాయి. -పావని, అవుకు

తల్లికి వందనంపై ప్రకటన చేయాలి



వైఎస్సార్‌సీపీ హయాంలో ఏటా జూన్ నెల విద్యా సంవత్సరం ఆరంభంలోనే అమ్మ ఒడి కింద రూ.13వేలు బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేది. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో రూ.15 వేల చొప్పున ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి నగదు అందజేస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి 40 రోజులు అయినా ఎలాంటి ప్రకటన చేయలేదు. అప్పులు చేసి ఇద్దరి పిల్లలను ప్రైవేటు స్కూలుకు పంపుతున్నా. -మంజుల, విద్యార్థుల తల్లి, ఉడుములపాడు, డోన్

యువతకు న్యాయం చేయాలి



నేను డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నాను. ప్రభుత్వం ఏర్పాటై దాదాపు 40 రోజులు అవుతున్నా నిద్యోగుల విషయంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన కనబడటంలేదు. ఎన్నో ఆశలతో ఉద్యోగ అవకాశాలు వస్తాయి.. ఒకవేళ ఉద్యోగం రాకపోతే నిరుద్యోగ భృతి అయినా అందుతుందని అనుకున్నా. కానీ ఇంతవరకు ప్రభుత్వం నిరుద్యోగభృతి ఊసే ఎత్తడంలేదు. అసెంబ్లీ సమావేశాల్లోనైనా యువతకు మంచి చేసేలా ప్రటకన ఉంటుందని ఆశిస్తున్నా. -మల్లికార్జున, అవుకు

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



తల్లికివందనం, రైతు భరోసా నిధులను సత్వరం మంజూరు చేసేలా స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీ ఓటాన్ బడ్జెట్ సమావేశాల్లో ప్రస్తావించాలి. పెట్టుబడి సాయం లేక రైతులు అధిక వడ్డీకి అప్పులు చేస్తున్నారు. ప్రభుత్వం ఇస్తామన్న రూ.20వేలు, తల్లికి వందనం కింద ఇస్తామన్న ఆర్థిక సహాయాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికి వెంటనే అందించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలి. -పురుషోత్తం, కునుకుంట్ల, అవుకు

అన్నదాన సుఖీభవ అమలు చేయాలి



ఖరీఫ్ సీజన్ ప్రవేశించి నెల రోజులు కావస్తోంది. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం పెట్టుబడి సాయం కింద ప్రతి రైతుకు రూ.20 వేలు అందించాలి. ఈ పథకం అమలుపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం దారుణం. రైతులు పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అసెంబ్లీలోనైనా ఈ పథకంపై ప్రకటన చేయాలి. -ఎం శివరామిరెడ్డి, రైతు, బనగానపల్లె

బార్ కౌన్సిల్ నిర్ణయంపై నిరసన



డోన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

డోన్ టౌన్: న్యాయవాదులు సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ మంజూరు కోసం బార్ కౌన్సిల్ రూపొందించిన నిబంధనలు సరికాదని ఆ నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని డోన్ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర కార్యదర్శి రాగుల రాముడు అన్నారు. సోమవారం స్థానిక సబ్ కోర్టు భవనం ఎదుట న్యాయవాదులతో కలిసి నిరసన తెలియజేశారు. బార్ కౌన్సిల్ కార్యదర్శి కృష్ణప్రసాద్, సీనియర్ న్యాయవాదులు కోట్ల హరిచంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, శేషశయనరావు, రామలింగయ్య, జొన్నలగడ్డ శ్రీనివాసులు పాల్గొన్నారు.

దేశభక్తితోనే ఐకమత్యం



వెంకయ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీఓ

డోన్ టౌన్: ప్రతి ఒక్కరూ దేశ భక్తిని పెంపొందించుకోవాలని ఆర్డీఓ మహేశ్వరరెడ్డి అన్నారు. జాతీయ జెండా ఆమోదించిన దినోత్సవం సందర్భంగా సోమవారం సామాజిక కార్యకర్త మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో జెండా రూపకర్త పింగళి వెంకయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మనకు స్వాతంత్ర్యం తీసుకొచ్చిన సమరయోధులను స్మరించుకోవడం బాధ్యత అని పేర్కొన్నారు. ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది మధుసుదన్, చిదంబరయ్య, నరసింహరాజు, హేమంత్‌కుమార్‌రెడ్డి, హరికృష్ణ, వెంకటేశ్వర్లు, కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు రక్షణ కల్పించాలని వినతి



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

కోవెలకుంట్ల: గిరిజనులపై అఘాయిత్యాలు, మహిళలపై దాడులు జరుగుతున్నాయని, వారికి రక్షణ కల్పించాలని కోవెలకుంట్లకు చెందిన ఆ సంఘం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌నాయక్, ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ కోరారు. ఈ మేరకు సోమవారం నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాను కలిసి వినతిపత్రం అందజేశారు. బనగానపల్లెలో గిరిజన మహిళపై కొందరు టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డా సీఐ గంటా సుబ్బారావు పట్టించుకోవడం లేదని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక కొందరు టీడీపీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బనగానపల్లె ఎంపీపీ గిరిజన మహిళ అని చూడకుండా టీడీపీ నాయకులు కృష్ణనాయక్, వారి కుటుంబీకులు, అనుచరులు ఆమె ఇంటి ముందు రాత్రి 11.30 గంటల సమయంలో అసభ్యకర వ్యాఖ్యలతో టపాసులు పేలుస్తూ భయభ్రాంతులకు గురి చేయడం హేయమైన చర్య అని అభివర్ణించారు. పోలీసులు పట్టించుకోకపోవడంతో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుడు కృష్ణనాయక్, మరికొందరి నుంచి ఎంపీపీ కుటుంబానికి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఎస్పీని కోరారు. గిరిజన సంఘం నాయకులు ఈశ్వర్‌నాయక్, శ్రీనివాస్, బాలునాయక్ తదితరులు ఉన్నారు.

చెడు అలవాట్లతో జీవితం నాశనం



మాట్లాడుతున్న సీఐ గంటా సుబ్బారావు

బనగానపల్లె రూరల్: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పిల్లలు–సామాజిక భద్రత అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుకునే వయసులో సెల్‌ఫోన్, వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి వాటికి దూరంగా ఉండాలని, పొగతాగడం, గుట్కా, మద్యం వంటి మత్తుపదార్థాలకు ఎంత దూరంగా ఉంటే జీవితం అంత బాగుంటుందని తెలిపారు. చెడు అలవాట్లకు భానిసకావడం వల్ల ఎన్నో అనార్థాలు జరిగే ప్రమాదం ఉందని, కేవలం చదువుపైనే ధ్యాస ఉంచి తల్లిదండ్రుల ఆకాంక్షను నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని పలు కాలనీల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని కొలిమిగుండ్ల సర్పంచ్ శివరాముడు తెలిపారు. పీహెచ్‌సీ సమీపంలోని కాలనీలో ఇటీవలే బోరు వేసి నీటి సౌకర్యం కల్పించామని చెప్పారు. విద్యుత్ తీగ కాలిపోవడం, ఇతర సాంకేతిక కారణాలతో ఒకటి, రెండు రోజుల పాటు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. కొందరు పనిగట్టుకుని నీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామ పంచాయతీ పట్టించుకోవడం లేదని పదే పదే ఆరోపించడం తగదన్నారు.

నిఫా వైరస్‌తో జాగ్రత్త

డోన్ రూరల్: గబ్బిలాల ద్వారా సంక్రమించే నిఫా వైరస్ అత్యంత ప్రమాదకరమైందని.. దీనిపై జాగ్రత్తగా ఉండాలని పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ నాగరాజు అన్నారు. పట్టణంలోని పశువైద్యశాలలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఈ వైరస్ బారిన పడిన వారు కోలుకోవడం చాలా తక్కువ శాతం ఉంటుందన్నారు. గబ్బిలాలు కనిపిస్తే వెంటనే తరిమివేయాలని తెలిపారు. ప్రజలు నిఫా వైరస్ బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

దివ్యాంగుల చట్టాలను అమలు చేయాలి

కోవెలకుంట్ల: దివ్యాంగుల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోవెలకుంట్లకు చెందిన జిల్లా దివ్యాంగుల జేఏసీ నాయకులు అందనం దేవరాజు, దాసు అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాను కలిసి వినతిపత్రం అందజేశారు. 2016లో దివ్యాంగుల కోసం ప్రవేశపెట్టిన చట్టం, అందులోని విషయాలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారని తెలిపారు.

పొలం ఆన్‌లైన్ చేయించుకున్నారని ఫిర్యాదు

ప్యాపిలి: స్థానికంగా లేకపోవడంతో తమ పొలాన్ని తమకు తెలియకుండా బంధువులు ఆన్‌లైన్ చేయించుకున్నారని రాచర్ల గ్రామానికి చెందిన పెద్ద వెంకటలక్ష్మమ్మ, వెంకటలక్ష్మమ్మ తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యపై ఆర్జీ సమర్పించారు. గ్రామంలోని 348–1 సర్వే నంబర్‌లో తమకున్న 4 ఎకరాల పొలాన్ని బంధువులు వారి పేరిట ఆన్‌లైన్ చేయించుకున్నారని.. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన తహసీల్దార్ విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని వీఆర్వోను ఆదేశించారు.

కాలనీలో సమస్యలను పరిష్కరించండి

డోన్ రూరల్: ప్రభుత్వాలు మారినా కాలనీలోని సమస్యలు పరిష్కారం కావడంలేదని, అధికారులు స్పందించి పరిష్కరించాలని ఏబీవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణత్‌యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జయరాంకు వినతి పత్రం అదించారు. సుందర్‌సింగ్ కాలనీలో డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు లేవని, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాలువలో మురుగు నిల్వ ఉండడంతో దోమలు బెడద అధికమైందని పేర్కొన్నారు. విజయ్, రజాక్, దివాకర్, శివ, మనోహర్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాల వద్ద ఆర్య వైశ్య సంఘం, లైఫ్ యువనేత్ర, లైఫ్ రక్త సహాయం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. పట్టణ ప్రజలు, ఆర్యవైశ్యులు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు.

కుష్టువ్యాధిపై అవగాహన అవసరం



సౌదరదిన్నెలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ మహబూబ్‌సుభాని

కోవెలకుంట్ల: కుష్టువ్యాధిపై అవగాహన అవసరమని రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్‌సుభాని అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో కుష్టు వ్యాధి లక్షణాలను గుర్తించేందుకు సోమవారం నుంచి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో 15 రోజులపాటు స్పర్శలేని మచ్చల గుర్తింపు కోసం ఇంటింటి సర్వే జరుగుతుందన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వ్యక్తులకు ఆరు నెలల నుంచి ఏడాది వరకు ఉచితంగా వైద్య చికిత్సలు అందిస్తామని తెలిపారు. వ్యాధి నివారణకు కావాల్సిన మందులు పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు గిరిజ, ప్రభావతి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంప్‌లు

అవుకు: మండల పరిధిలోని గ్రామ సచివాలయాల్లో మంగళవారం నుంచి ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మల్ రెడ్డి తెలిపారు. రామాపురం –1, శింగనపల్లె, గుండ్లశింగవరం గ్రామ సచివాలయాల్లో ఆధార్ సెంటర్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఆధార్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఆధార్‌లో పేర్ల మార్పు, అడ్రస్ మార్పు, చిన్నారుల ఆధార్, తదితర సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. అలాగే ఆధార్ క్యాంప్‌లపై ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

సంజామల: మండలంలో మంగళవారం నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయకుమార్ రెడ్డి తెలిపారు. ఈ నెల 23న కానాల, 24న గిద్దలూరు, 25న ఆర్.లింగందిన్నె, 26న ఆకుమల్ల, 27న ముక్కమల్ల గ్రామ సచివాలయాల్లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

ఆధార్‌లో మార్పులు చేర్పులకు అవకాశం

డోన్ రూరల్: ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు, అప్‌డేట్ చేసుకోవాలనుకునే వారి కోసం ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక క్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. కొత్త ఆధార్ కార్డులకు సైతం అవకాశం ఉందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేడుకగా ఉమామహేశ్వరుని పల్లకీ సేవ



బనగానపల్లెరూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి సోమవారం పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏకశిలా రూపంలో కొలువైన శివపార్వతులకు అభిషేకం, అర్చనలు జరిగాయి. సాయంత్రం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుదీర్చి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతులకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ప్యాపిలి: తోటి భవన నిర్మాణ కార్మికుడు గుండెపోటుతో మృతి చెందడంతో రోడ్డున పడ్డ ఆ కుటుంబానికి సోమవారం తమ వంతు ఆర్థికసాయం అందజేసి అండగా నిలిచారు. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన ఉల్లి రాంబాబు(38) ఈ నెల 6వ తేదీ గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య మహాలక్ష్మి, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇంటి యజమాని అకాల మరణంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న బాధిత కుటుంబానికి తోటి బేల్దారులు చేయి చేయి కలిపి రూ. 71,500ను సేకరించి మృతుడి భార్య మహాలక్ష్మికి అందజేశారు. మద్దిలేటి, మధు, నిలీంద్ర, నరసింహ, చంద్ర, రమేష్ పాల్గొన్నారు.



శిథిలావస్థలో ఉన్న బనగానపల్లె ప్రభుత్వ అతిథి గృహం



ఆర్అండ్‌బీ కార్యాలయం

నాడు ఘనం.. నేడు శిథిలం

బనగానపల్లె: బనగానపల్లె సంస్థానాన్ని నవాబులు పరిపాలించిన సమయంలో అన్ని వసతులతో పట్టణంలో సువిశాలమైన మైదానంలో మూడు అతిథి గృహాలను నిర్మించారు. అతిథులు, అధికారులు, ప్రముఖులతో కళకళలాడిన అతిథి గృహాలు నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలతో కనిపిస్తోంది. అభివృద్ధికి నోచుకోక కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. అలాగే ఆర్అండ్‌బీ కార్యాలయం కూడా దుస్థితికి చేరి నిరుపయోగంగా మారింది. నవాబుల కాలంలో ఈ కార్యాలయాన్ని దివాన్ కార్యాలయంగా ఉపయోగించారు. 1993లో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఒక సూట్‌తో చిన్న అతిథి గృహాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఈ అతిథి గృహంలో ఆర్అండ్‌బీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. బనగానపల్లె నియోజకవర్గానికి ప్రతినిధ్యం వహిస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి రోడ్లు భవనాలశాఖ మంత్రిగా ఉండడంతో వీటికి మోక్షం లభిస్తాయని స్థానికులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

డోన్ టౌన్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి ప్రజల నుంచి సూచనలు, సలహాలు, ఫిర్యాదులు స్వీకరించడానికి మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య 9959225795 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.